క్లుప్తంగా

ముస్లింలకు పెమ్మసాని క్షమాపణ చెప్పాలి

పట్నంబజారు: ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ కరీముల్లా గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెమ్మసాని ఇష్టానుసారంగా మైనార్టీల మనోభావాలు దెబ్బతీనేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికే ముస్లిం మైనార్టీ వర్గాలు నిరసన తెలియజేస్తున్నప్పటికీ ఈ అంశంపై టీడీపీ ముస్లిం నేతలు మాట్లాడకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. పెమ్మసాని తక్షణమే క్షమాపణ చెప్పాలనే డిమాండ్‌ను తెలిపారు.

హాస్టల్‌లో చోరీ

గుంటూరు ఈస్ట్: ప్రైవేటు హాస్టల్‌లో ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు చోరీకి గురైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బ్రాడీపేట 6/9లోని మను బాలుర హాస్టల్‌లో బుధవారం రాత్రి వెనుక తలుపులు తెరిచి నిద్రించారు. గదిలోని రెండు ల్యాప్‌టాప్‌లు, మూడు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితులు అశోక్, ప్రమోద్, కిరణ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గురువు జీవితం అతి పవిత్రమైనది

ప్రత్తిపాడు: గురువు జీవితం ఎంతో పవిత్రమైనదని పునీత శౌరివారి పుణ్యక్షేత్రం ఫాదర్ దిలీప్‌కుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరులోని పునీత శౌరివారి పుణ్యక్షేత్రంలో కథోలిక సభ గురువుల పండుగైన పవిత్ర గురువారం (పెద్ద జేస్తవారం)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పునీత శౌరివారి పుణ్యక్షేత్రం ఫాదర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ కథోలిక సంఘంలో పనిచేస్తున్న క్రైస్తవ మత గురువులకు గుర్తుగా పవిత్ర గురువారం పండుగ నిర్వహించామన్నారు. ఏసు ప్రభువు తన మరణానికి ముందురోజు శిష్యులతో కలిసి కడరా భోజనం చేశారని విశ్వాసులకు గుర్తు చేశారు. విశ్వాసుల ప్రేమకు గుర్తుగా పన్నెండు మంది శిష్యుల పాదాలు కడిగారు. అర్ధరాత్రి పన్నెండు గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫాదర్ పవన్, మఠకన్యలు, విశ్వాసులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

కళాశాల విద్య గుంటూరు ప్రాంత సంచాలకులు పి.కళావతి

చేబ్రోలు: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయటం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కళాశాల విద్య గుంటూరు ప్రాంత సంచాలకులు పి.కళావతి పేర్కొన్నారు. చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పి.కళావతి మాట్లాడుతూ టెక్నికల్ స్కిల్స్‌పై పట్టు సాధించిన వారికి ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విడదల శ్రీదేవి వార్షిక రిపోర్టును వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు, మెమొంటోలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే సహించేది లేదు

తెనాలిరూరల్: గ్రామాల్లో అలజడులు రేపితే సహించేది లేదని, కఠినంగా వ్యవహరిస్తామని రూరల్ ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు హెచ్చరించారు. తెనాలి రూరల్ పోలీసులు, సీఐఎస్‌ఎఫ్ బలగాలు గురువారం మండలంలోని జాకీర్ హుస్సేన్‌నగర్, హాఫ్‌పేట, ఖాజీపేట, ఎరుకలపూడి గ్రామాల్లో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. అసాంఘిక శక్తులను గుర్తించి కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు భద్రత మీ వెంటే ఉంటుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేందుకు అన్ని ప్రాంతాల్లో రూట్ మార్చ్ నిర్వహిస్తున్నటుల్ తెలిపారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్

గుంటూరు రూరల్: విద్యార్థులు అధ్యాపకుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన అధ్యాపకుడు చేగూడి రంగారావుకు తమిళనాడుకు చెందిన అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. పవర్ క్వాలిటీ ఇంప్రూమెంట్ ఇన్ మైక్రోగ్రిడ్ త్రూ ఆప్టిమల్ కంట్రోల్ ఆఫ్ రెన్యూబుల్ ఎనర్జీ సోర్సెస్ అనే అంశంపై డాక్టర్ ఆర్.బాలమురుగన్, డాక్టర్ రామకోటేశ్వరరావుల పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. అధ్యాపకుడిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ తదితరులు అభినందించారు.

ఈవీఎంలపై అవగాహన తప్పనిసరి

జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి



ఈవీఎంలపై డెమో ఇస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంపై ఎన్నికల విధుల్లోని అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, అందుకు తగిన శిక్షణ అందిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సెక్టోరల్, రూట్, ఇంజినీరింగ్ అధికారులకు ఈవీఎంల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పనితీరుపై అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. ఎన్నికల రోజు ఈవీఎంలో ఏ సమస్య ఎదురైనా తక్షణం పరిష్కారించేలా శిక్షణ పొందాలన్నారు. జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు కూడా తగిన శిక్షణ తీసుకోవాలన్నారు. సెక్టోరల్, రూట్ అధికారులకు క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, బారిగేట్లను ఇంజినీరింగ్ అధికారులు కల్పిస్తారని, పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ల వివరాలపై బీఎల్వోలు సహకరిస్తారని చెప్పారు. ఎన్నికల సరళిలో చిన్నపొరపాటుకు కూడా తావివ్వడానికి వీల్లేదని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ శిక్షణలో సునీల్, భీమరాజు, సెక్టోరల్ అధికారి శ్రీధర్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'రన్ ఫర్ జీసస్'



విలేకరులతో మాట్లాడుతున్న సతీష్ బాబు

నెహ్రూనగర్: క్రీస్తు పునరుత్థాన దినాన్ని పురస్కరించుకొని మానవాళి సుఖ సంతోషాలతో మనుగడ సాగించాలనే ఉద్దేశంతో శనివారం ఉదయం 5 నుంచి 9 గంటల వరకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం గుంటూరు నగరంలో నిర్వహించనున్నట్లు రన్ ఫర్ జీసస్ కో–ఆర్డినేటర్ సెయింట్ మాథ్యూస్ వెస్ట్ పారిస్ పాస్టర్ రెవరెండ్ జి.సతీష్ బాబు తెలిపారు. గురువారం గుంటూరులోని వెస్ట్ పారిష్ చర్చి ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. క్రైస్తవ సంఘాల మధ్య ఐక్యత, యువత సమన్వయం, ప్రజల్లో సమభావం పెంపొందించాలనే లక్ష్యంతో క్రీస్తు పునరుత్థానం పురస్కరించుకొని హిందూ కాలేజ్ కూడలి వద్ద ఉన్న వెస్ట్ పారిస్ చర్చి నుంచి రన్ ఫర్ జీసస్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. నగరంపాలెం, కలెక్టరేట్, కంకరగుంట ఫ్లైఓవర్, ఎన్టీఆర్ స్టేడియం, లక్ష్మీపురం, లాడ్జి సెంటరు, నార్త్ పారిష్, చర్చ్ దగ్గర రన్ ముగుస్తుందని వెల్లడించారు. నగరంలోని అన్ని క్రైస్తవ సంఘాలు, సంస్థలు, సంఘస్తులు, విశ్వాసులు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఏఈఎల్‌సీ సినడ్ బిషప్ రైట్ రెవరెండ్ ఎస్‌జే బాబురావు, బొలెద్దు మాథ్యూస్, కె.నిరంజన్, బెంజిమెన్ ఫ్రాంక్లిన్, నెల్సన్, జాన్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన సభ



మాట్లాడుతున్న స్వీప్ సంస్థ నోడల్ అధికారి సత్యన్నారాయణ

లక్ష్మీపురం: సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, ధ్రుడమైన ప్రజాస్వామ్యం కోసం తప్పనిసరిగా ఓటు వేయాలని స్వీప్ సంస్థ నోడల్ అధికారి కేవీవీ సత్యాన్నారాయణ పిలుపు నిచ్చారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం 'నేను ఖచ్చితంగా ఓటేస్తాను' అంటూ ఓటరు చైతన్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక గౌరవమని, దానిని కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఐదేళ్లకోసారి ప్రజాప్రతినిదులను ఎన్నుకునేదానికన్నా.. విలువైన పని ఇంకొకటి లేదన్నారు. ఖచ్చితంగా ఓటు వేస్తామని ప్రతి ఒక్కరూ ప్రతిన బూనాలన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడారు. ఓటు విలువ, దాని ప్రాధాన్యం గురించి అవగాహన ఉన్నా.. ఓటు హక్కుని వినియోగించుకునే వారి సంఖ్య తగ్గడం ఆందోళన కలిగించే విషయమన్నారు. అనరంతరం సంస్థ సభ్యులు తదితరులు ప్రసంగించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



పాత గుంటూరు: కొరిటెపాడు ఆంజనేయపేట లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా గురువారం ఉదయం తిరుపతమ్మ– గోపయ్య స్వామికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చన , గోపూజ తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సువాసీనుల కుంకుమ పూజలు గావించారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయ్‌కుమార్, రవికుమార్, బాజీ తదితరులు పర్యవేక్షించారు.

మహిళా విభాగం అధ్యక్షురాలిగా నాగలక్ష్మి

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి పట్టణ క్లస్టర్–2 మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన రావులపల్లి నాగలక్ష్మి గురువారం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. క్లస్టర్–2లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, రానున్న ఎన్నికల్లో పార్టీకి మహిళల మద్దతును కూడగట్టేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ సూచించగా, తన సాయశక్తులా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

పుట్టపర్తి నారాయణాచార్యులకు ఘననివాళి

గుంటూరు రూరల్: పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు ఒక గొప్ప తెలుగు కవి అని, ఆధునిక మహాకావ్యంగా పలువురు పండితులు కొనియాడిన శివతాండవం సృష్టికర్త అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాంఫాంనందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో పుట్టపర్తి నారాయణచార్యుల జయంతి సందర్భంగా ఘనంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ ఎనిమిది భాషల్లో మాట్లాడగలుగుతూ, 14 భాషల్లో పట్టు కలిగిన మహాకవి ఆయనని కొనియాడారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.గురవారెడ్డి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి.కరుణసాగర్, పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ ఏవీ రమణ, ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ జి.రామారావు, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.ప్రశాంతి, ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ డాక్టర్ బి.విజయాభినందన, ఎగ్జామినేషన్ కంట్రోలర్ డాక్టర్ మునిరత్నం, డాక్టర్ వై.పద్మలత పాల్గొన్నారు.

జయలక్ష్మీ హోండా నూతన షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న హోండా ప్రతినిధులు

పాత గుంటూరు: గుంటూరు నగరంలో హోండా ద్విచక్ర వాహన నూతన షోరూం 'హోండా బిగ్ వింగ్' గురువారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో హోండా 'బిగ్వింగ్' ప్రతినిధులు ఆదర్శ్, దేభర్ష్య దత్త, ఎండీ నారయ్య, సీఈఓ యుగంధర్, సంస్థ ప్రతినిధులు పాల్గొని, ఘనంగా ప్రారంభించారు. షోరూం వర్క్‌షాప్‌ను గుంటూరు నగర టూ వీలర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ ప్రారంభించారు. ఈ షోరూంలో నేటి యువతకు కావాల్సిన అన్ని రకాల 300సీసీ నుంచి 500సీసీ వరకు మోడల్స్ లభిస్తాయని షోరూం నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవ ఆఫర్ కింద 18, 25 సంవత్సరాల వారికి రూ.12,500ల రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆఫర్ మార్చి 31 వరకు మాత్రమేనని, అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఆర్‌వీఆర్‌జేసీలో బిజినెస్ మోడల్ కాన్వాస్‌పై సదస్సు



సెమినార్‌లో మాట్లాడుతున్న సంస్థ డైరెక్టర్ శ్రీనివాసన్ శరవణ్

గుంటూరు రూరల్: విద్యార్థి ఆలోచనలను అంకుర పరిశ్రమల స్థాపన వైపు దృష్టి సారిస్తే భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవడం సులభతరం అవుతుందని అల్కవ్ పార్టనర్స్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసన్ సరవణ్ పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఆర్‌జేఈ నెస్ట్ సహకారంతో జరిగిన బిజినెస్ మోడల్ క్యాన్వాస్ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంకుర పరిశ్రమలు ఏవిధంగా స్థాపించాలో వివరించారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంక్యూబేషన్ కౌన్సిల్ సీఈఓ డైరెక్టర్ రవి ఈశ్వరపు, మేనేజర్ దినకర్ వాడపల్లిలు మాట్లాడుతూ అంకుర పరిశ్రమల స్థాపనలో వివిధ దశలను వివరిస్తూ, అది విజయాల దిశగా అభివృద్ధి సాధించడానికి అనుసరించాల్సిన పద్ధతులను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థికి ఉద్యోగ ఆలోచనతో సాగే చదువు ఒకస్థాయి వరకే తీసుకెళ్తుందని, ఆ ఆలోచనతో పాటూ అంకుర పరిశ్రమల వైపు ఆలోచనలు విద్యార్థి భవిష్యత్తును మార్చి ఉన్నతస్థాయి చేరువకు దారి చూపుతాయని చెప్పారు. ఆ దిశగా విద్యార్థులను తయారు చేయడానికి కళాశాలలో ఇంక్యూబేటర్ సెంటర్ అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. విద్యార్థులు విద్యతో పాటుగా న్యూస్టార్టప్ శిక్షణను పొందటం వారి ఆలోచనలకు అనుగుణంగా వారు ఎంచుకున్న రంగాలలో విజయం పొందటానికి సాధ్యపడుతుందని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. నిపుణులచే నిర్వహించే సదస్సులలో శిక్షణ అందుకోవడం ద్వారా విద్యార్థుల మేథా శక్తిని, నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏట డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఆర్టీసీ కాలనీలో సీజీజీ బ్యాంక్ శాఖ ప్రారంభం



నూతన శాఖను ప్రారంభిస్తున్న జీఎం రమణరావు

నగరంపాలెం: ఖాతాదారులకు నిర్విరామంగా సేవలు అందించాలని, బ్యాంక్ నూతన శాఖ వ్యాపార అభివృద్ధికి సరికొత్త బాటలతో ముందుకెళ్లాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ డాక్టర్ బీవీ రమణరావు పేర్కొన్నారు. ఆర్టీసీ కాలనీ పైప్‌లైన్ రోడ్డులోని భాష్యం స్కూల్ సమీపం నూతనంగా నెలకొల్పిన బ్యాంక్ 263వ శాఖను గురువారం జీఎం ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుంటూరు నగరంలో బ్యాంక్ సేవలను మరింత విస్తృతం చేస్తున్నామని తెలిపారు. ఏజీఎం, గుంటూరు రీజినల్ మేనేజర్ పి.వీరారెడ్డి మాట్లాడుతూ ఖాతాదారులతో బ్యాంక్ అధికారులు, సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ఓర్పు, సహనంతో వారికి సేవలందించాలని పేర్కొన్నారు. అన్ని వర్గాల ఖాతాదారుల ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా డిపాజిట్లపై 8.60% అత్యధిక వడ్డీని అందిస్తున్నామని చెప్పారు. ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా బ్యాంక్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. తద్వారా 8 జిల్లాల్లో 27 లక్షల మంది ఖాతాదారుల అభిమానంతో రూ.22 వేల కోట్ల వ్యాపారం సాధించామని తెలిపారు. ఆర్టీసీ కాలనీలోని తమ నూతన శాఖ ద్వారా పాత గుంటూరు, ఆర్టీసీ కాలనీ పరిసర ప్రాంతాల్లోని ప్రజల బ్యాంకింగ్ అవసరాలను సంపూర్ణంగా తీరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, బి.శ్రీనివాసరావు, బి.సువర్ణరాజు, బ్రాంచి మేనేజర్ జి.తులసిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కు ప్రాధాన్యంపై అవగాహన



గరికపాడు(కాకుమాను): ఓటు హక్కు ఎంతో విలువైనదని, అలాంటి విలువైన ఓటు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తహసీల్దార్ పార్వతి అన్నారు. మండలంలోని గరికపాడులో గురువారం ఓటర్లను చైతన్య పరచడం, వారిని భాగస్వాములు చేయడం కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధంలాటిందని, అలాంటి ఎంతో విలువైన ఓటు గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఆయన సూచించారు. మద్యం, నగదు, ఇతర ప్రలోభాలాకు గురికాకుండా ప్రతి ఒక్కరు తమ పవిత్రమైన ఓటును వినియోగించుకోవాలని అప్పుడే ప్రతి ఒక్కరు సంతోషంగా ఉంటారని ఆమె తెలిపారు. ఓటుతోనే దేశ ప్రగతి ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని ఆమె కోరారు. ఈసందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యత గురించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో పతకాల పంట



విద్యార్థులతో విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్నేషనల్ మాథ్స్ ఒలింపియాడ్ పోటీ పరీక్షలో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో గురువారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మాథ్స్ ఒలింపియాడ్‌లో భాగంగా వివిధ అంశాల్లో తమ విద్యార్థులు 45 పతకాలు సాధించినట్లు వెల్లడించారు. విశ్లేషణాత్మకమైన ఆలోచనతో కూడిన ఇటువంటి పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, పతకాలు సాధించడం ద్వారా పోటీతత్వం అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వర ప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతీదేవి, సీనియర్ కో–ఆర్డినేటర్ డి. దుర్గాశ్యామ్ పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలి



రామకృష్ణమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: కళాశాల విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో గురువారం ఎంబీఏ చివరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణమూర్తి మాట్లాడుతూ.. తమ కళాశాల పూర్వ విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్నారని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు జ్ఞాపకాలు కాదని, జీవితాలు అని భావోద్వేగమయ్యారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలతో ఆకట్టుకున్నారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చక్రవర్తి, ఐక్యూ ఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్లు డి.కల్యాణి, డాక్టర్ ఎస్.గోపి శ్రీనివాసరావు, సహాయ ఆచార్యులు సీహెచ్ వైష్ణవి, ఎ.బాజీబాబు, సీహెచ్ వేదవతి, అనిత, ఎస్. మణికంఠ, వి.అభిలాష్ పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు ఆదర్శం

- ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాంజీ
- జీఈసీ కళాశాలలో ఘనంగా వార్షికోత్సవం



ప్రత్తిపాడు: మహనీయుల జీవితాలను నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె. రాంజీ అన్నారు. ప్రత్తిపాడు మండలం యనమదల గుంటూరు ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం కళాశాల 16వ వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్. కె.రాంజీ, సినీ నటుడు పృథ్వీలు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంజీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలంటే మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సినీ నటుడు పృథ్వీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే సమయంలో సోషల్ మీడియా మత్తులో పడి తమ జీవితాలను పాడు చేసుకోవద్దని చెప్పారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ సాంకేతిక ప్రపంచంలో రాణించాలంటే ఇంజినీరింగ్ విద్యతోపాటు ఆన్‌లైన్ కోర్సులు కూడా అవసరమేనన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, అకడమిక్ డైరెక్టర్ గోగినేని సాంబశివరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జబర్దస్త్ టీంతో జోష్..

కళాశాలలో జరిగిన వార్షికోత్సవంలో స్పెషల్ అట్రాక్షన్‌గా సినీ గ్లామర్ జోడయ్యింది. ఉదయం సినీ నటుడు పృథ్వీ, సాయంత్ర జబర్దస్త్ టీం శాంతి స్వరూప్, దొరబాబు, రైజింగ్ రాజు, హరితలు హాజరయ్యారు. వీరు కామెడీ స్కిట్‌లు, డ్యాన్సులతో ఫుల్ జోష్ నింపారు. పంచ్‌లు పేలుస్తూ విద్యార్థులతో కలిసి సందడి చేశారు.

రేపు గోపాత్రుడు నవలపై చర్చావేదిక

తెనాలి: పత్రికా సంపాదకురాలు ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో నెలనెలా ఏర్పాటు చేస్తున్న చర్చావేదికను ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నారు. ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయ్యే సభలో సుప్రసిద్ధ రచయిత, పాత్రికేయుడు కేఎన్‌వై పతంజలి నవల 'గోపాత్రుడు'పై చర్చ ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు. జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య, 'చినుకు' సంపాదకుడు నండూరి రాజగోపాల్ ప్రధాన వక్తలుగా వివరించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. కొల్లిపర మండలం అన్నవరపులంక గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 14 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఓటు హక్కును వినియోగించుకోండి



105 సంవత్సరాల మారుతీని సన్మానిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అవేర్నెస్ గ్రూప్ సభ్యులు ఇంటింటి సర్వేను గురువారం నిర్వహించారు. సర్వేను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం తెనాలి పట్టణానికి చెందిన 105 సంవత్సరాల వృద్ధురాలు పోచరాజు మారుతీని ఆమె నివాసంలో మున్సిపల్ అధికారులు కలిశారు. మే 13న జరిగే ఎన్నికల్లో కూడా ఓటును వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, కాకి వికాస్, పలువురు మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.